ఆంధ్రజ్యోతి
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3, కనిష్ఠం 23.0
నిజామాబాద్
జిల్లా వార్తలు
3
గురువారం 4 జూలై 2024



నేటి నుంచి ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ

నిజామాబాద్ అర్బన్, జూలై 3: ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాల కోసం ఎప్‌సెట్-2024 మొదటి విడత ప్రవేశాల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు జిల్లా సమన్వయకర్త శ్రీరాంకుమార్, సిస్టమ్ అడ్మిన్ భాను చందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4నుంచి 12 వరకు స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 6వ తేదీ నుంచి 13వ తేదీలలో హెల్ప్‌లైన్ సెంటర్లలో సర్టిఫికెట్ వేరిఫికేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 8 నుంచి 15 తేదీలోగా వెబ్ఆప్షన్లు నమోదు చేసుకోవాలని, ఈనెల 19తేదీలోగా సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.



మండల పరిషత్‌లో ప్రత్యేక పాలన

- ముగిసిన ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం
- ప్రత్యేకాధికారులను నియమించిన ప్రభుత్వం
- నేటితో ముగియనున్న జడ్పీ సభ్యుల పదవీకాలం
- ఆలస్యం కానున్న స్థానిక సంస్థల ఎన్నికలు

నిజామాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మండల ప్రజాపరిషత్ అధ్యక్షుల పదవీకాలం పూర్తి కావడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు జిల్లాలోని 27 మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. జిల్లాలోని ఆర్మూర్ మండలానికి సహకార శాఖ అధికారి శ్రీనివాస్‌ను, బాల్కొండకు బీడబ్ల్యూవో ఎస్‌కె రసూల్‌బీ, భీమ్‌గల్‌కు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆర్ఎం విష్ణువర్ధన్ రెడ్డి, బోధన్‌కు జిల్లా పంచాయతీ అధికారి చక్రవర్తి తరుణ్ కుమార్‌ను నియమించారు. చందూర్‌కు ఏడీ మైన్స్ విజయ్‌కుమార్ రాథోడ్, ధర్పల్లికి డీఎల్‌పీవో ఎం.శ్రీనివాస్, డిచ్‌పల్లికి కార్మికశాఖ డీసీ యోహాన్, ఇందల్‌వాయికి మార్క్‌ఫెడ్ డీఎం రంజిత్ రెడ్డి, జక్రాన్‌పల్లికి డీడీ తిరుమల ప్రసాద్‌లను నియమించారు. కమ్మర్‌పల్లికి డీఆర్‌డీ వో సాయగౌడ్, కోటగిరికి డీఎల్‌పీవో సాయిబాబా, మాక్లూర్‌కు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ముత్తెన్న, మెం డోరాకు ఏడీ ఫిషరీష్ రాజనర్సయ్య, మోర్తాడ్‌కు డీహెచ్ ఎస్‌వో మధుసూదన్, మోస్రాకు ఈడీ ఎస్‌ఈ కార్పొరేషన్ డి.రమేష్, మోపాల్‌కు జీఎం డీఐసీ సురేష్ కుమార్, ముప్కాల్‌కు సర్వేలైన్స్ ఏడీ శ్రీనివాస్, నందిపేటకు పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ జగన్నాథ చారిలను నియమించారు. నవీపేటకు సీపీవో మల్లిఖార్జున్, నిజామాబాద్‌కు మెప్మా పీడీ రాజేందర్, రెంజల్‌కు జేడీఏ వాజిద్‌హుస్సేన్, రుద్రూర్‌కు డీఎస్‌సీడీవో శశికళ, సిరికొండకు డీటీడీవో నాగోరావు, వేల్పూర్‌కు డీఎండబ్ల్యూవో కృష్ణవేణి, వర్నికి ఏపీడీ రవీందర్, ఎడపల్లికి డైరీ డీడీ నంద కుమారి, ఏర్గట్లకు డీఎల్‌పీవో శివకృష్ణను నియమించారు. వీరంతా గురువారం ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రభుత్వం మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి ఎంపీటీసీలను ఎన్నుకొని ఎంపీపీల, వైస్ ఎంపీపీల ఎంపిక పూర్తయ్యేంతవరకు ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలోనే పాలన కొనసాగనుంది. మండలాలకు సంబంధించిన నిధుల వినియోగంతో పాటు అభివృద్ధి పనులను వీరి ఆధ్వర్యంలోనే కొనసాగించనున్నారు.

ముగిసిన ఎంపీటీసీ సభ్యుల ఐదేళ్ల పాలన

జిల్లాలో ఎంపీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీల పదవీకాలం బుధవారంతో ముగిసింది. ఐదేళ్ల పాలన పూర్తికావడం, ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనకు మొగ్గు చూపింది. మండల ప్రజాపరిషత్‌కు ఎన్నికలు నిర్వహించేంతవరకు వీరి ఆధ్వర్యంలోనే పాలన కొనసాగించాలని ఆదేశాలను ఇచ్చారు. ప్రభుత్వం తరఫున పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేశారు. కలెక్టర్ ఆధ్వర్యంలో మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశాలను ఇచ్చారు. ఇంజనీరింగ్ విభాగాలను మినహాయించి జిల్లా అధికారులు, డిప్యూటీ డైరెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులను ఆయా మండలాలకు ప్రత్యేక అధికారులుగా నియమించాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. మండలాలకు నియమించే ప్రత్యేక అధికారులు అక్కడ పనిచేస్తున్న ఎంపీడీవోల కంటే ఒకస్థాయిపై ఉండాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. జిల్లాలో గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో 29 మండలాలు ఉన్నాయి. వీటికి పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఎంపీటీసీలు, జడ్పీటీసీల ఎన్నికలను నిర్వహించారు. ఎంపికైన వారిలో ఈ 29 మండలాలకు ఎంపీపీలుగాను, వైస్ ఎంపీపీలుగాను ఎంపిక చేసి ఐదేళ్లుగా పాలన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు కొత్తగా మరో నాలుగు మండలాలను ఏర్పాటు చేసింది. డొంకేశ్వర్, ఆలూర్, పోతంగల్, సాలూరా మండలాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జిల్లాలో 33 మండలాలు ఉన్నాయి. వీటన్నింటికి ప్రత్యేక అధికారులను నియమిస్తారు. వీరి ఆధ్వర్యంలోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించేంతవరకు పాలన కొనసాగనుంది.

మండలాలకు ప్రత్యేకాధికారుల నియామకం

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను కొంత ఆలస్యంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకోవడంతో ఈ ప్రత్యేక అధికారులను మండలాలకు నియమించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావడం సర్పంచులతో పాటు ఎంపీటీసీలు, జడ్పీటీసీల ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో వాయిదా వేసింది. పరిస్థితులకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఫిబ్రవరిలోనే సర్పంచుల పాలన పూర్తి కాగా జిల్లాలోని 530 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. వారి ఆధ్వర్యంలోనే పాలన కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను చేస్తున్నారు. పాలకవర్గం లేకున్నా రోజువారి కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. మండల ప్రజాపరిషత్ సభ్యుల పదవీకాలం బుధవారంతో పూర్తికావడంవల్ల మళ్లీ ఎన్నికలు నిర్వహించేంతవరకు ప్రత్యేకాధికారులను నియమించారు. వీరి ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగించేందుకు నిర్ణయించారు. మండల స్థాయిలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన నిధులను వివిధ పథకాలకు ఖర్చు పెడుతున్నారు. మండల స్థాయిలో చర్చించి ఆయా గ్రామాలకు మండల ప్రజాపరిషత్ ద్వారా నిధులను ఖర్చు చేశారు. సభ్యుల పదవీకాలం ముగియడంతో కొత్తగా నియమితులైన ప్రత్యేక అధికారుల ద్వారానే ఈ పనులను కొనసాగిస్తారు. ఎంపీడీవోలు ఇతర అధికారుల ఆధ్వర్యంలో పనులను పూర్తి చేస్తారు. కేంద్ర రాష్ట్ర పథకాల నిధులతో పాటు వివిధ అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఇస్తున్న నిధులు కూడా ఉండటంతో జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు.

స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యమే!

ప్రభుత్వం మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేయడంతో స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యం కానున్నాయి. గ్రామాల్లో సర్పంచులతో పాటు మండల స్థాయిలో ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా పోటీ చేసేందుకు చాలా మంది నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఎన్నికలతో ఆశలు పెట్టుకున్నారు. పదేళ్లుగా పదవులకు దూరమైన నేతలతో పాటు కొత్త నేతలు కూడా పోటీకి సన్నద్ధమవుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి చెందిన నేతలు ఎక్కువగా ఈ పదవులపై ఎదురు చూస్తున్నారు. ఎన్నికలు పెట్టగానే సర్పంచులుగా, ఎంపీటీసీలుగా, జడ్పీటీసీలుగా పోటీ చేసి కీలకమైన పదవులను చేరుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మండల స్థాయిలో ఎంపీపీలుగాను, జడ్పీ స్థాయిలో జడ్పీ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా పోటీ పడేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేయడం, రిజర్వేషన్‌లకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిన తర్వాతనే నిర్వహించేందుకు సిద్ధమవుతుండటంతో మరికొన్ని నెలల పాటు నేతలు ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. అప్పటి వరకు ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలోనే పాలన కొనసాగనుంది.



నేటితో జడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం పూర్తి

జిల్లా ప్రజాపరిషత్ సభ్యుల పదవికాలం గురువారంతో ముగియనుంది. జడ్పీ సభ్యుల పదవికాలం ఐదేళ్లు పూర్తికానుండటంతో ప్రత్యేక అధికారిని పాలన కోసం నియమిస్తున్నారు. జిల్లా పరిషత్‌కు జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారిగా కొనసాగనున్నారు. సభ్యుల పదవికాలం పూర్తికాగానే కలెక్టర్ ఈ బాధ్యతలను చేపట్టనున్నారు. మళ్లీ ఎన్నికలు జరిగి జడ్పీటీసీ సభ్యులు పదవి శ్రీకారం చేయడంతో పాటు కొత్త చైర్మన్, వైస్‌చైర్మన్‌లను ఎన్నుకునేంతవరకు కలెక్టరే ప్రత్యేకాధికారిగా కొనసాగనున్నారు.



జీలుగ సాగుతో భూసారం వృద్ధి



జీలుగ సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏవో మహేందర్‌రెడ్డి

ముప్కాల్, జూలై 3: జీలుగ సాగుతో భూసారం వృద్ధి చెందుతుందని ఏవో మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం చిట్టాపూర్‌లో పచ్చిరొట్టే పైరును, జీలుగ విత్తనాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం రాయితీపై పచ్చి రొట్టె పైరును, జీలుగ విత్తనాలు అందజేస్తుందని, వరి వేసే మగానుల్లో మే చివరిలో విత్తనాలు చల్లుకోవాలన్నారు. జీలుగు గాలిలోని నత్రజనిని వేర్లలో సిరికరించి భూమిలో నత్రజని లభ్యతను పెంచుతుందని తద్వారా రసాయనిక ఎరువుల్లో 30శాతం ఆదా చేసుకోవచ్చని, ఒక ఎకరంలో పండించిన పచ్చిరొట్టే పైరున జీలుగను నేలలో తొక్కించడం ద్వారా 40నుంచి 60టన్నుల సేంద్రియ పదార్థాన్ని భూమికే అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఏఈవో నిహారిక, రైతులు పాల్గొన్నారు.



ఊపందుకోని వానాకాలం సాగు

- జిల్లాలో వర్షాలు లేక భారీగా పెరగని సాగు విస్తీర్ణం
- ఆరుతడి పంటల సాగును పూర్తి చేసిన రైతులు
- భూగర్భ జలాలు తగ్గడంతో వరి వేసేందుకు జంకుతున్న అన్నదాతలు
- భారీ వర్షాలు పడితే వరిసాగు చేసేందుకు ఏర్పాట్లు
- జిల్లాలో 2లక్షల 27,146 ఎకరాల్లో పంటల సాగు

నిజామాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఈ యేడు భారీ వర్షాలు లేవు.. వాగుల పొంగులు లేవు.. చెరువుల్లో ఇప్పటి వరకు వరద చేరలేదు. నెలరోజులైనా భారీ వర్షాలు లేకపోవడంతో వానాకాలం అనుకున్న విధంగా సాగు విస్తీర్ణం పెరగడం లేదు. భూగర్భ జలాలు తక్కువగా ఉండటం వల్ల రైతులు ఆరుతడి పంటలను సాగు చేశారు. వరిసాగుకు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని రెండు ప్రధాన ప్రాజెక్టులతో పాటు చెరువుల్లో తగినంత నీళ్ల లేకపోవడం వల్ల భారీ వర్షాలు పడిన తర్వాతనే వరిసాగుకు రైతులు వేచి చూస్తున్నారు. నిజాంసాగర్ నీటిని విడుదల చేయడం వల్ల బోధన్ డివిజన్ పరిధిలో వరిసాగు కొనసాగుతుండగా మిగతా డివిజన్ పరిధిలో రైతులు వర్షాలకు అనుగుణంగా ఈ పంటలను సాగు చేస్తున్నారు. భారీ వర్షాలు పడితే పెద్ద మొత్తంలో వరినాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. అదనుదాటుతున్నా.. నారు పెరుగుతున్నా భారీ వర్షాలు పడి భూగర్భ జలాలు పెరిగిన తర్వాతనే వరిసాగు చేసేందుకే రైతులు మొగ్గు చూపుతున్నారు.

వానాకాలం సీజన్ మొదలై నెల దాటింది

జిల్లాలో వానాకాలం మొదలై నెల రోజులు దాటింది. జిల్లా అంతటా ఇంకా సగటు సరాసరి వర్షపాతం నమోదు కాలేదు. కొన్ని మండలాల పరిధిలో వర్షం పడగా మరికొన్ని మండలాల పరిధిలో సగటు వర్షపాతం కంటే తక్కువగా పడింది. జిల్లాలో 33 మండలాల పరిధిలో తగినంతగా వర్షం పడలేదు. నెల రోజుల్లో భారీ వర్షాలు పడకపోవడం వల్ల భూగర్భ జలాలు కూడా పెరగలేదు. జిల్లాలో జూన్ ఆరంభం నుంచి ఇప్పటి వరకు 177.7 మిల్లిమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 158.7 మిల్లిమీటర్ల వర్షం పడింది. జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 12.3 మిల్లిమీటర్ల వర్షం నమోదైంది. అత్యధికంగా మోర్తాడ్ మండలంలో 33.7 మిల్లి మీటర్ల వర్షం పడింది. జిల్లాలోని 33 మండలాలు ఉండగా 7 మండలాల పరిధిలో సగటు వర్షంకంటే ఎక్కువ వర్షం పడింది. జిల్లాలోని 14 మండలాల్లో సగటు వర్షపాతం నమోదైంది. మిగతా 12 మండలాల్లో సగటు వర్షపాతం కన్న తక్కువగా వర్షం పడింది.

వర్షాల ఆధారంగా పంటల సాగు

జిల్లాలో ఇప్పటి వరకు పడిన వర్షాల ఆధారంగా రైతులు పంటల సాగును కొనసాగిస్తున్నారు. ఈ సంవత్సరం వానాకాలంలో 5లక్షల 52,128 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలో ఇప్పటి వరకు నెలరోజుల్లో 2లక్షల 27,146 ఎకరాల్లో పంటలను వేశారు. ఈ ప్రణాళిక ప్రకారం జిల్లాలో 4లక్షల 30,550 ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా వేశారు. ఇప్పటి వరకు భారీ వర్షాలు పడకపోవడం వల్ల అనుకున్న విధంగా వరిసాగు కాలేదు. జిల్లాలో ఇప్పటి వరకు 85,422 ఎకరాల్లో మాత్రమే వరిసాగును చేశారు. జిల్లాలో మొక్కజొన్న భారీగా పెరిగింది. 40,670 ఎకరాల్లో ఈ పంటను సాగు చేశారు. సోయాబీన్ వ్యవసాయ శాఖ అంచనా వేసినదానికన్న తక్కువగానే రైతులు వేశారు. దిగుబడి తగ్గుతుండటం పంట చేతికొచ్చే సమయంలో భారీ వర్షాల వల్ల దెబ్బతింటుండటంతో రైతులు ఈ సంవత్సరం తక్కువగా వేశారు. జిల్లాలో 28, 896 ఎకరాల్లో ఈ పంటను వేశారు. జిల్లాలో పసుపు 23,600 ఎకరాల్లో సాగు చేశారు. ఇవేకాకుండా దైంచ 46,841 ఎకరాల్లో వేశారు. వీటితో పాటు కందులు, పెసర, మినుములు రైతులు సాగు చేశారు.

వర్షాలు లేకనే పంటలు ఆలస్యం..

: రాజన్న, రైతు మధన్‌పల్లి



వర్షాలు లేక భూగర్భ జలాలు పెరగలేదు. పంటలు వేస్తామంటే బోర్లలో తగినంత నీళ్లు రావడం లేదు. వరిసాగు చేసేంతగా భూగర్భ జలాలు రాకపోవడం వల్ల వర్షాల కోసం ఎదురు చూస్తున్నాం. భారీ వర్షాలు పడగానే ఎక్కువ మొత్తంలో వరిసాగు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

జిల్లాలో సాగు కొనసాగుతోంది..

: వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయ అధికారి



జిల్లాలో కురుస్తున్న వర్షాలకు అనుగుణంగా పంటల సాగు కొనసాగుతోంది. రైతులు ఆరుతడి పంటల సాగును పూర్తి చేశారు. వరిసాగుకే నారుమళ్లను వేశారు. బోధన్ పరిధిలో నాట్లు కొనసాగుతున్నాయి. రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాం. పంటలకు సంబంధించిన సూచనలు, సలహాలను అందిస్తున్నాం.



ఉద్యోగుల బదిలీలకు సర్కారు గ్రీన్ సిగ్నల్

- ఈనెల 5 నుంచి 20 వరకు బదిలీ చేయాలని ఉత్తర్వులు
- జిల్లా, జోన్, రాష్ట్ర స్థాయిలో బదిలీ కానున్న ఉద్యోగులు
- ప్రయత్నాల్లో నిమగ్నమైన ఉద్యోగులు

నిజామాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉద్యోగులు ఎదురు చూస్తున్న బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బదిలీలపై ఉన్న స్టేను ఎత్తివేసి అన్ని శాఖల్లోని ఉద్యోగులను బదిలీ చేసేందుకు ఉత్తర్వులను జారీ చేసింది. ఉత్తర్వులకు అనుగుణంగా ఈనెల 5 నుంచి 20 వరకు బదిలీ ప్రక్రియను చేపట్టనున్నారు. ఆయా శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసును బట్టి కౌన్సెలింగ్ ద్వారా బదిలీలను చేయనున్నారు.

ఇప్పటికే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి

ఇప్పటికే ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టిన ప్రభుత్వం అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సాధారణ బదిలీలకు అనుమతి ఇచ్చింది. బదిలీలకు షెడ్యూల్ విడుదల చేయడంతో పాటు ప్రభుత్వం తరఫున ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ కోసం జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్యాడర్‌ను బట్టి కమిటీలను ఖరారు చేసింది. దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు రెండు సంవత్సరాలు సర్వీసు దాటిన ఉద్యోగులందరినీ బదిలీ చేసేందుకు ఉత్తర్వులను ఇచ్చారు. బదిలీలో దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. భార్యభర్తలు ఒకేచోట చేసేందుకు అవకాశం ఉంటే బదిలీ చేయనున్నారు. ఈ బదిలీల కోసం జిల్లా స్థాయిలో కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో పాటు ఆయా శాఖల జిల్లా అధికారులు కమిటీ సభ్యులుగా ఉండనున్నారు. శాఖల వారిగా బదిలీ చేసే సమయంలో శాఖ అధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. జోన్ పరిధిలో జరిగే బదిలీలకు సంబంధిత శాఖల హెచ్‌వోడీలు, రాష్ట్రస్థాయి జాయింట్ లేదా డిప్యూటీ సెక్రెటరీలు, రీజినల్ డైరెక్టర్లు సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర క్యాడర్ అధికారులకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేదా ముఖ్య కార్యదర్శితో పాటు సంబంధిత శాఖ రాష్ట్రస్థాయి అధికారి, ప్రభుత్వం నియమించే జాయింట్ లేదా డిప్యూటీ సెక్రెటరీ సభ్యులుగా ఉంటారు. వీరి ఆధ్వర్యంలో బదిలీలను చేపట్టనున్నారు.

రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఈనెల 5 నుంచి 8 వరకు ఉద్యోగులు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. ఈనెల 9 నుంచి 14 వరకు దరఖాస్తుల ఆధారంగా జాబితాను సంబంధిత శాఖల అధికారులు సిద్ధం చేస్తారు. ఉద్యోగులు ఇచ్చే ఆప్షన్‌లను బట్టి ఈనెల 15, 16న బదిలీ ఉత్తర్వుల జారీ చేయనున్నారు. జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి క్యాడర్‌ను బట్టి ఈ బదిలీలను కొనసాగిస్తారు. శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో 33 శాతం వరకు బదిలీ కానున్నారు. నిబంధనల ప్రకారం అటెండర్ నుంచి జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్‌లతో పాటు శాఖల అధికారులు బదిలీ కానున్నారు. తహసీల్దార్లు, ఎస్సైలు, సీఐలు, ఎంపీడీ వోలు, మండల పంచాయతీ అధికారులతో పాటు వివిధ ఇంజ నీరింగ్ శాఖలో పనిచేస్తున్న ఏఈలు, డీఈలు, ఈఈల వరకు బదిలీ కానున్నారు. వీరితో పాటు డివిజన్ స్థాయిలో పనిచేస్తున్న ఏడీలతో పాటు ఇతర అధికారులు ఉత్తర్వుల ప్రకారం బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఉద్యోగులు కూడా ఈ ఉత్తర్వుల ప్రకారం సొంత జిల్లాలకు రానున్నారు. జిల్లా స్థాయిలో మండలాల్లో పనిచేస్తున్న జూనియర్, సీనియర్ అసిస్టెంట్ల వరకు బదిలీ కానుండగా మండల స్థాయి అధికారులు జోనల్ పరిధిలో బదిలీ కానున్నారు. మరికొంత మంది అధికారులు మల్టీజోన్ పరిధిలో బదిలీ చేయనున్నారు. జిల్లా స్థాయి అధికారులు రాష్ట్ర క్యాడర్‌లో ఉండటం వల్ల ఇతర జిల్లాలకు కాని రాష్ట్ర డైరెక్టరేట్‌లకు గానీ బదిలీ కానున్నారు.

బదిలీల కోసం ముమ్మర ప్రయత్నాలు

ప్రభుత్వం సాధారణ బదిలీలకు అనుమతి ఇవ్వడంతో ఇప్పటి వరకు ఈ బదిలీల కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగులు, అధికారులు ఇక గట్టి ప్రయత్నాలు చేయనున్నారు. నిబంధనల ప్రకారం సర్వీసు పూర్తి చేసుకున్న వారు బదిలీ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మండల స్థాయిలో పనిచేస్తున్న కింది స్థాయి ఉద్యోగులు జిల్లా హెడ్ క్వాటర్స్‌తో పాటు డివిజన్ హెడ్‌క్వాటర్స్‌కు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మండల స్థాయిలో పనిచేస్తున్న తహశీల్దార్లు, ఎస్సైలు, సీఐలు, ఎంపిడివోలు, మండల పంచాయతీ అధికారులతో పాటు ఏఈలు నచ్చిన ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. జోనల్ పరిధిలో పోస్టులు రావడంతో దగ్గరగా ఉన్న జిల్లాలకు తమకు నచ్చిన జిల్లాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కొంత మంది అధికారులు ఇప్పటికే నేతల ద్వారా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు నిబంధనలు విడుదల చేయడం వల్ల దానికి అనుగుణంగానే ఉద్యోగుల బదిలీలు చేసే అవకాశం ఉందని సంఘాల నేతలు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లా స్థాయిలో బదిలీల కోసం అధికారులు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.

దివ్యాంగులకు పింఛన్లు అందజేయాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

బోధన్‌రూరల్,జులై3: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు పింఛన్‌లు పెంచి ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో బుధవారం బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఉపాధ్యక్షులు గైని రాములు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల్లో వికలాంగులకు 5శాతం రిజర్వేషన్ అమలు చేయాలని,ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కూడా ప్రాధాన్యత కల్పించి రిజర్వేషన్ అమలు చేయాలని అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. భూమి లేని వికలాంగులకు ప్రభుత్వం ఉచితంగా భూమిని అందజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు షేక్.నసీర్, గౌరవ అధ్యక్షులు ఏశాల గంగాదర్, రాంపటేల్, మండల నాయకులు నజీముద్దీన్, గైని లక్ష్మణ్, సవిత, కవిత, లక్ష్మి, పోశవ్వ, దేవదాసు, ఒడ్డెన్న, రాములు, తదితరులు పాల్గొన్నారు.

పదవులు శాశ్వతం కాదు

● ఎంపీడీవో రాజా శ్రీనివాస్

కమ్మర్‌పల్లి, జూలై 3: మంనం చేపట్టిన పదవులు శాశ్వతం కాదని ప్రజా సేవలో మన ప్ర వర్తన ఆదర్శగా నిలుస్తుందని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలపరిషత్ ప్రజాపరిషత్ ప్రజాప్రతినిదుల (ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, జడ్పీటీసీ)పదవి కాలం ముగిసిన సందర్భంగా వారికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గత ఐదు సంవత్సరాలు ప్రజాప్రతినదులుగా అభివృద్ధి కార్యక్రమాల్లో తమవంతుగా అందిం చిన సేవలనను గుర్తుచేసుకున్నారు. అనంతరం తహసీల్దార్‌తో కలిసి జడ్పీటీసీ రాధరాజగౌడ్, ఎంపీపీ లోలం గౌతమి, వైస్ ఎంపీపీ కలేరు శేఖర్, కోఆప్షన్ సభ్యుడు పాష, ఎంపీటీసీలు సుధాకర్, పిప్పెర అనీల్, దుబాక సుప్రియ, నోముల రజిత, తోట జ్యోతి, సుప్రియయాదవ్, గంగాధర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో సూపరింటిండెంట్ షైలారం గంగాధర్, ఏపీఎం కుంట గంగారెడ్డి, కేబీవి ప్రత్యేక అధికారి గంగామణి,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆమేర్‌ఖాన్ , మం డలపరిషత్ అధికారులు పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయసిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

రెంజల్,జులై3: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను బుధవారం పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ రాజయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌లు పరిశీలించారు. పాఠశాలలో తాగునీటి సౌకర్యం, మరుగు దొడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులలో నిర్లక్ష్యం వహించకుండా నాణ్యత ప్రమాణాలతో పనులను చేపట్టాలని కాంట్రాక్టర్‌లకు సూచించారు. ఆయన వెంట ఎంపీవో గౌసోద్దీన్,పీఆర్ ఏఈ వినయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజేందర్ రావు, ఉబేద్ తదితరులున్నారు.

సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన

ఎల్లారెడ్డి, జూలై 3 : గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్ నెంబర్ల నుంచి ఫోన్‌కాల్స్, ఎస్ఎంఎస్‌లు లింకులు వస్తే ఎట్టి పరిస్థితులలో మీ వ్యక్తిగత సమాచారాలు ఎవరికి చెప్పకూడదని ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు గాని మీ తల్లిదండ్రులు గాని గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌లు చేస్తే స్పందించకూడదని ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్ చేయాలని తెలిపారు.

బీర్కూర్ : మండల కేంద్రంలోని కానప్ప చౌరస్తాలో బుధవారం సైబర్ నేరాల నియంత్రణపై పోలీసులు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత వివరాలు, వోటీపీ, బ్యాంకు ఖాతా నెంబర్, ఆధార్ కార్డు వివరాలు ఎవరికి ఇవ్వకూడదని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఫోన్‌ల అప్పగింత

బీర్కూర్, జూలై 3 : బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఇటీవల తన మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సాయంతో ఫోన్‌లను గుర్తించి రికవరీ చేశారు. బైరాపూర్, నసురుల్లాబాద్‌లకు చెందిన ముగ్గురు బాధితులను పీఎస్‌కు పిలిపించి ఏఎస్సై ఫోన్‌లను అందజేశారు.

మాజీ మేజర్‌కు ఘనస్వాగతం

పెద్ద కొడప్‌గల్, జూలై 3: పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రానికి చెందిన సీఆర్‌పీఎఫ్ సుబేదార్ మేజర్ అయిన బర్వాల్ అమర్ సింగ్ భారత సైన్యంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసి గ్రామానికి చేరుకున్న సందర్భంగా బుధవారం గ్రామస్తులు, తండావాసులు ఘన స్వాగతం పలికారు. ఉద్యోగ విరమణ చేసి గ్రామానికి చేరుకున్న అమర్‌సింగ్‌కు గ్రామస్తులు కాటేపల్లి చౌరస్తా నుంచి ఆయన్ను తన ఇంటి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

బీబీపేట, జూలై 3: బీబీపేట మండలంలోని షేరి బీబీపేట గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త తాళ్ల దేవరాజ్‌గౌడ్ తండ్రి తాళ్ల బాల్‌రాజ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి పరామర్శించారు. ఆపద సమయంలో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ నాయకులు రంజిత్‌గౌడ్, మల్లేషం, పోసు శివ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలి

● సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్‌బాబు

పెద్దబజార్, జూలై 3: అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనాలు కల్పించాలని, సౌకర్యాలను మెరుగుపర్చాలని అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్‌బాబు అన్నారు. బుధవారం నగరంలోని ధర్నాచౌక్ వద్ద సమస్యలను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన మెమో నంబరు 1334ను తక్షణమే ఉపసంహరించుకోవాలని అదేవిధంగా అంగన్‌వాడీ ఉద్యోగులను గత సెప్టెంబర్ నెలలో నిర్వహించిన 24 రోజుల సమ్మె సందర్భంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మంత్రులు అధికార సమక్షంలో ఇచ్చిన హామీ మేరకు 65 సంవత్సరాలు నిండిన టీచర్లకు 2లక్షల రూపాయలు, ఆయాలకు లక్ష రూపాయలు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడానికి అంగీకరించడంతో పాటు ఆసరా పెన్షన్ రిటైర్డ్‌మెంట్ ఉద్యోగులందరికీ అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. జారీ చేసిన సర్క్యులర్‌లో జీవో నంబర్ 10 ప్రకారం 65 సంవత్సరాలు నిండిన వారందరికి రిటైర్డ్‌మెంట్ ప్రకటించాలని జూలై 1వ తేదీ నుంచి వారికి జీతాలు ఇవ్వబడవని సర్క్యులర్ జారీ చేయడం జరిగిందన్నారు. జీవో ప్రకారం టీచర్‌కు లక్ష రూపాయలు, ఆయాకు 50వేల రూపాయలు మాత్రమే చెల్లిస్తామని అందులో పేర్కొనడం జరిగిందన్నారు. అనంతరం ధర్నా శిబిరానికి వచ్చిన ఐసీడీఎస్ పీడీకి మెమోరాండం ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడి యూనియన్ జిల్లా నాయకులు దేవగంగు, శంకర్‌గౌడ్, చంద్రకళ, సూర్యకళ, శివరాజన్న, కరుణ, ఎలిజబెత్ రాణి, జ్యోతి, సరిత, గోదావరి, తదితరులు పాల్గొన్నారు.

పాతూర్ యూత్ గణేష్ మండలి కార్యవర్గం ఎన్నిక

నందిపేట, జూలై 3: మండల కేంద్రంలోని శ్రీ ఓంకార రూపిణి దురాదేవి మండపంలో బుధవారం పాతూర్ యూత్ గణేష్ మండల నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షులుగా నాళేశ్వర్ మహేష్, ఉపాధ్యక్షులుగా బర్కి విజయ్, కొహినూర్ అక్షయ్, కోశాధికారులుగా ఏర్రం పవన్, ఏర్రం హరిష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. నూతన కమిటీకి బాధ్యతలు అప్పగించారు. లావాదేవీలు సరిచేసుకున్నారు. కొత్తగా ఏర్పాటైన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఏర్రం కొత్తూర్ సాగర్, కొహినూర్ అనిల్ కుమార్, కొత్తపేట రాజు, నద్కుడ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

వ్యాక్సిన్‌లు అందించడంలో నిర్లక్ష్యం తగదు

● డీఐవో డాక్టర్ అశోక్ కుమార్

కమ్మర్‌పల్లి, జూలై 3: పిల్లలకు నెలవారిగా వ్యాక్సిన్ అందించడంలో ఏమాత్రం నిర్లక్ష్య పనికిరాదని, ప్రతీనెల తప్పకుండా వ్యాక్సిన్ అందేలా చూడాలని జిల్లా ఇమ్యూనైజేషన్ (డీఐవో) అధికారి డాక్టర్ అశోక్ అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని చౌట్‌పల్లి, హసాకొత్తూర్ ఆరోగ్య ఉపకేంద్రాలలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపకేంద్రాలలోని వ్యాక్సిన్ రికార్డులను పరిశీలించారు. ప్రతినెల పిల్లలకు అందజేస్తున్న వ్యాక్సిన్ వివరాలను స్థానిక ఏఎన్ఎంలు శ్యామల, గీతలను అడిగి తెలుసుకున్నారు. పుట్టి నుంచి 5 సంవత్సరాల వయస్సు పిల్లలకు వేసే వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయని వ్యాక్సిన్ పిల్లలకు వేయడంలో ఎంతమాత్రం నిర్లక్ష్యంగా వ్యహరించవద్దన్నారు. ఈ విషయంలో అశ్రద్ధ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆకస్మిక తనిఖీ చేపట్టిన డీఐవో వెంట జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ తరుణ్, ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ సుప్రియ, హెచ్‌వో సత్యనారాయణ, ఫార్మాసిస్టు రవికుమార్, డీఈవో మధు, హెల్త్‌అసిస్టెంట్ జగదీష్ ఆయా గ్రామాల ఆశావర్కర్లు ఉన్నారు.

'ప్రజాప్రతినిధుల సేవలు మరువలేనివి'

బీబీపేట, జూలై 3: ప్రజా ప్రతినిధుల సేవలు మరువలేనివని జడ్పీటీసీ ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం బీబీపేట మండల ఎంపీపీ, ఎంపీ టీసీల పదవీకాలం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతినిత్యం గ్రామప్రజలకు అండగా ఉంటూ వారికి ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించి సేవలు చేశారని తెలిపారు. ప్రజలకు సేవ చేసినవారిని వచ్చే ఎన్నికలలో ప్రజలే గెలిపించుకుంటారని తెలిపారు. అనంతరం ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలను ఎంపీడీవో పూర్ణ చంద్రో యకుమార్ సన్మానించారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తహసీల్ధార్ సత్యనారాయణ, ఎంపీపీ బాలమణి, వైస్ఎంపీపీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

రామారెడ్డి, జూలై 3 :రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు అటికెల మల్లేష్ తండ్రి అటికెల నర్సయ్య మృతి చెందడంతో ఆయన కుటుం బాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే సురేందర్ పరామర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి మరణం పట్ల ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని అన్నారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని కోరుతు న్నామ న్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రంగు రవీందర్‌గౌడ్, నాయకులు కాసర్ల రాజేందర్, శ్రీనివాస్, బాల్‌దేవ్, అంజయ్యరెడ్డి, నాయకులు మల్లేష్ యాదవ్, కిషన్ యాదవ్, పాలమల్లేష్ పాల్గొన్నారు.

లింగంపేట గ్రామపంచాయతీ తైబజార్ వేలం

లింగంపేట, జులై 3 : లింగంపేట గ్రామపంచాయతీలో తైబజార్ వేలం నిర్వ హించారు. రూ.4లక్షల 80వేలకు గ్రామానికి చెందిన అర్షద్ పాషా దక్కించు కున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తెలిపారు. వేలం పాటలో అత్యధి కంగా వేలం పాడిన అర్షద్‌పాషాకు సంవత్సరం వరకు తైబజార్‌లో డబ్బులు వసూలు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

నేడు ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

జక్రాన్‌పల్లి, జూలై3: మండల కేంద్రంలోని జక్రాన్‌పల్లిలో ఆదర్శ పాఠశాల, కళాశాలలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు, అలాగే ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ ఈనెల 4న స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదర్శ పాఠశాలలో, కళాశాలలో ఆసక్తి గల విద్యార్థులు టీసీ, బోనాఫైడ్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో ఫోటోలతో గురువారం పాఠశాలలో ఉదయం 10గంటలకు హాజరుకావాలన్నారు. ఆర్మూర్, ఇతర ప్రాంతాల నుంచి జక్రాన్‌పల్లికి అప్ అండ్ డౌన్ చేసే సౌకర్యం ఉన్న విద్యార్థులు కూడా ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీలో అడ్మిషన్‌లకు అవకాశం ఉందన్నారు. ఆర్మూర్, నిజామాబాద్ నుంచి ఈ పాఠశాలకు, కళాశాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉందన్నారు. చదువుకునే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాం ఇవ్వడం జరుగుతుందన్నారు.

'మాటిచ్చా.. సరస్వతి గుడిని నిర్మించా'

» 'ఆంధ్రజ్యోతి'తో సినీ గేయ రచయిత చంద్రబోస్

» ఆయన స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్ గ్రంథాలయం'



ఆస్కార్ గ్రంథాలయం

చిట్యాల, జూలై 3: ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ తన గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో సొంత నిధులతో ఆస్కార్ పేరిట ఓ గ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన చంద్రబోస్.. 'గ్రామస్థులకు ఇచ్చిన మాట ప్రకారం సరస్వతి గుడిని నిర్మించా. చాలా సంతోషంగా ఉంది' అని ఆనందం వ్యక్తం చేశారు. చల్లగరిగలోని తమ ఇంటి పక్కన ఉన్న గ్రంథాలయంలో ఎన్నో సాహిత్య పుస్తకాలు చదివానని, వాటి వల్లే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా చెప్పారు. ఆర్ఆర్ఆర్ సినిమాకు తాను రాసిన నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో బాల్య మిత్రులు, గ్రామ ప్రజలు తనని సన్మానించారని చెప్పారు. ఆ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామంలో అత్యాధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాటను ఈ రోజున నిలబెట్టుకున్నానని వివరించారు. అందరి సహకారంతో రూ. 36లక్షల వ్యయంతో ఎనిమిది నెలల్లో భవనాన్ని సిద్ధం చేసి ఆస్కార్ గ్రంథాలయం అని నామకరణం చేశామని చెప్పారు. కాగా, రచయిత చంద్రబోస్ తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు.

ఇద్దరు రైతుల ఉసురు తీసిన అప్పులు

పెంబి రూరల్, బొంరాస్‌పేట్, జూలై 3: పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. ఇందుకోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. పత్తి విత్తనా లు మొలకెత్తకపోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చాలని బాకీలు ఇచ్చిన వారు వేధించడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మెట్లకుంట గ్రామానికి చెందిన బైరం నర్సింహులు(62)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ఎకరన్న సీలింగ్ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో బుధవారం ఉరేసుకున్నాడు.

ఉస్మానియా ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం

» టార్చ్‌లైట్ల వెలుగులో శస్త్రచికిత్సలు

మంగళ్‌హాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శస్త్రచికిత్సలు చేసే సమయంలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిన వెంటనే ప్రారంభం కావాల్సిన జనరేటర్లు సైతం మొరాయించాయి. సిబ్బంది వెంటనే విద్యుత్ విభాగం నిపుణులను రప్పించి అరగంట తర్వాత సేవలను పునరుద్ధరించారు. దీంతో అప్పటివరకు సెల్‌ఫోన్, టార్చ్‌లైట్ల వెలుతురులోనే శస్త్రచికిత్సలను కొనసాగించినట్లు సమాచారం.

'జికా'...వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

» సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ

» కనీస చర్యలూ తీసుకోని వైనం

» ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్ర్కీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ఠ పర్యవేక్షణ లేకపోవడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.



సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

» చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం

» 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పన చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! బాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్లుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటి దాకా యాదాద్రి జిల్లా చొల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

కుటుంబాన్ని మింగేసిన మద్యం రాకాసి

● మద్యానికి బానిసైన భర్త వేధింపులు తాళలేక.. ముగ్గురు కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ తల్లీ, ఓ కూతురు మృతి మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమం

కాగజ్‌నగర్, జూలై 3: ఐదుగురు ఆడపిల్లల తండ్రి అయిన ఓ వ్యక్తి బాధ్యతలు మరచి మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది అతని భార్యాబిడ్డలు ఆత్మహత్యకు యత్నించారు. భార్య, ఓ కుమార్తె మరణించగా మరో ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమంగా ఉంది. ఇలా కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడ గ్రామానికి చెందిన ఓ కుటుంబాన్ని మద్యం మింగేసింది. వివరాలిలా ఉన్నాయి. గజ్జిగూడకు చెందిన ప్రతాప్‌కు భార్య అనిత(55), ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురికి వివాహమవ్వగా లక్ష్మి(21), రవళి(18), రమ్య(16), ఐశ్వర్య(14) ఇంటి వద్దే ఉంటున్నారు. మద్యానికి బానిసైన ప్రతాప్ తాగిన మైకంలో గ్రామస్థులతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో తమకున్న వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని అమ్మేశాడు. మిగిలిన కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ అనిత కుటుంబాన్ని పోషించేది. ఈ క్రమంలో 15 రోజుల క్రితం పొలం వద్ద జరిగిన గొడవలో భాగంగా ప్రతాప్ ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో హత్యాయత్నం కేసులో ప్రతాప్ జైలుకెళ్లాడు. అయితే, గ్రామ ప్రజల సాయంతో ప్రతాప్‌కు బెయిల్ ఇప్పించిన అనిత భర్తను జైలు నుంచి బయటకు తీసుకొచ్చింది. ఆ తర్వాత కూడా ప్రతాప్ తీరుమారకపోవడంతో మద్యం మానేయాలంటూ అనిత సోమవారం గొడవపడింది. ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రతాప్ భార్య అనితపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అనిత.. కుమార్తెలు రమ్య, లక్ష్మీ, ఐశ్వర్య, రవళితో కలిసి పొలానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. రవళి మినహా తల్లీకూతుళ్లు అందరూ పురుగు మందు తాగేశారు. రవళి కేకలు విని అక్కడికి వచ్చిన చుట్టుపక్కల పొలాల్లోని వారు అనిత, ఆమె కుమార్తెలను ఆస్పత్రికి తరలించారు. అయితే, రెండ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత, రమ్య బుధవారం మృతి చెందారు. లక్ష్మీ, ఐశ్వర్య పరిస్థితి విషమంగా ఉంది. మరోవక్క, ప్రతాప్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

పిడుగుపాటు కాదు.. అంతర్గత లోపమే!

● 'భద్రాద్రి పవర్ ప్లాంట్' ప్రమాదంపై తేల్చిన జెన్‌కో..

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రమాదానికి అంతర్గత లోపాలే కారణమని తేలింది. పిడుగుపాటు వల్ల ప్రమాదం జరగలేదని జెన్‌కో స్పష్టం చేసింది. భద్రాద్రి పవర్ ప్లాంట్ ఒక్కోటి 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు (1080 మెగావాట్లు) ఉండగా.. అందులో 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1లోని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ గత శనివారం అగ్నిప్రమాదం జరిగి కాలిపోయింది. అయితే దీనికి పిడుగుపాటే కారణమని తొలుత ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జెన్‌కో అధికారులతో విచారణ జరిపించారు. పిడుగు పడిన సమయంలోనే యాదృచ్ఛికంగా జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ అంతర్గత లోపాలతో, దాని లోపల మంటలు ఉత్పన్నమ య్యాయని, ఇందుకు బాహ్య కారణాలు లేవని తేల్చారు. దీనిపై ప్రభుత్వానికి జెన్‌కో తాజాగా ఓ నివేదిక సమర్పించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఓ వ్యవస్థ దెబ్బతిని.. ఆయిల్ లీకేజీ చోటుచేసుకుని పూర్తిగా దగ్ధమైందని అందులో అధికారులు వివరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.30 కోట్లకు పైగా నష్టం జరిగినట్టు ఇప్పటికే ఓ నిర్ధారణకు వచ్చారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా విప్పి పరిశీలించిన తర్వాత నష్టంపై పూర్తి స్పష్టత రానుందని ప్రభుత్వానికి జెన్‌కో నివేదించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో అంతర్గత లోపాలు ఏర్పడడానికి నిర్మాణ, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు

నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్ల పాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.

మంత్రి పొంగులేటిని కలిసిన డీసీసీబీ చైర్మన్



మంత్రి పొగులేటిని కలిసిన డీసీసీబీ చైర్మన్

నిజామాబాద్ అర్బన్, జూలై 3: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ రమేష్‌రెడ్డి బుధవారం కలిశారు. బ్యాంకులకు సంబంధించిన పరిస్థితిని వివరించారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో ఎన్ని సహకార సొసైటీలు ఉన్నాయి, వాటి పరిధిలో జరిగే బ్యాంకు లావాదేవీలను వివరించడంతో పాటు ఆర్థిక పరిస్థితిని కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులకు సంబంధించి కొంత మందివి ధరణిలో పూర్తిస్థాయిలో ఎంట్రీ కాలేదని వాటికి అవకాశం ఇవ్వాలని మంత్రిని ఆయన కోరారు. సానుకూలంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించినట్లు ఆయన తెలిపారు.

ఏర్గట్ల అయ్యప్ప స్వామి ఆలయం వద్ద అన్నదానం

ఏర్గట్ల, జూలై 3: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద బుధవారం స్వామి వారికి అభిషేకం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సమితీ సభ్యులు మాట్లాడుతూ ప్రతీ బుధవారం దాతల సహకరంతో అన్నధాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఆలయం వద్ద దోంచంద గ్రామానికి చెందిన ఎర్ర శేషేందర్ వనజ, సాహితీ, శ్రీనివాస్‌లు ఆధ్వర్యంలో అన్నధానం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, భక్తులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

సిరికొండ,జూన్3:కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలండర్‌ను ప్రకటించి నిరుద్యోగులైన యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనిప్రభుత్వాన్ని బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి సీహెచ్.శ్రావణ్‌రెడ్డి కోరారు. బీజేవైఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిరికొండ తహసీల్దార్ రవీందర్ రావుకు బుధవారం బీజేవైఎం మండల కమిటీ వినతి పత్రాన్ని అందజేశారు. శ్రావన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలీఫై చేయాలని,గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిఫికేషన్లలో అదనపు పోస్టులను పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని పరీక్షలను వాయిదా నూతన తేదీలను ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.కానిస్టేబుల్ నియామకాల్లో అన్యాయం జరుగుతున్న జీవోఎంఎస్ నెం.46ను రద్దు చేయాలని శ్రావన్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.గోపి,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థుల ఎంపిక

ధర్పల్లి, జూలై3: బాసర ట్రిపుల్ ఐటికి మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రాజేందర్ సాహెబ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన మెగావత్ పల్లవి, లోలం మేఘాన, చాట్ల చందన, దాబవత్ అంకిత, లక్మ అక్షయ, లొడియా వసుంధరలు ఎంపికైనట్టు పేర్కొన్నారు. బుధవారం ప్రకటించిన ట్రిబుల్ ఐటి ఫలితాల్లో మోడల్ పాఠశాల విద్యార్థుల ఎంపిక పట్ల ఉపాధ్యా యులు, ఏపీసీ సభ్యులు విద్యార్థులను అభినందనలు తెలిపారు.

రుద్రూరులో సైబర్ నేరాలపై అవగాహన

రుద్రూరు,జూలై3: రుద్రూరు మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో బుధవారం రాత్రి సైబర్ నేరాల నియంత్రణపై ఎస్ఐ అప్పారావు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీ, బ్యాంకు ఖాతా నెంబర్, ఆధార్ కార్డు వివరాలు ఎవరికి ఇవ్వకూడదని అన్నారు. ఈకార్యక్రమంలో రుద్రూరు పోలీసు సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన టీఎన్‌జీవోస్ జిల్లా నాయకులు



మంత్రిని కలిసిన టీఎన్‌జీవోస్ నేతలు

సుభాష్‌నగర్, జూలై 3: మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్కలను టీఎన్‌జీవోస్ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రుల కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను మంత్రుల ముందు ఉంచారు. త్వరలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు అలుక కిషన్ తెలిపారు. అంగన్‌వాడి టీచర్ల సమస్యలు వయస్సు సడలింపుపై సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, కార్యదర్శి నేతికుంట శేఖర్, బాధ్యులు పోల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు జాఫర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మోస్రా సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మోస్రా,జులై3: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ముందుగా ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ప్రజా ప్రతినిధులను, అధికారులను వేదిక మీదకు ఆహ్వానించారు. జడ్పీటీసీ ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ పరిధిలోని సమస్యలు పరిష్కారం దిశగా మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సమస్యలు లేవనెత్తి పరిష్కారం చేయాలని కోరారు. ఇందులో భాగంగా జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగిసిన సందర్భంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, మండల అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు వారిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాము ఇచ్చి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మోటాడిరెడ్డి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ ఉమారాములు, వైస్ ఎంపీపీ శంకర్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ మారుతీ, ఏపీవో సురేష్, అటవీశాఖ అధికారి వినయ్, విద్యుత్ శాఖ అధికారి మిధున్, మిషన్ భగీరథ సాత్విక, ఎంపీఓ రఫీ, చింతకుంట మాజీ సర్పంచ్ విమల లింగయ్య, గోవూర్ మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ముతీబ్, భూమేష్, ప్రేమ్, కృష్ణ, మహేశ్వరి, టెక్నికల్ అసిస్టెంట్ అంబర్‌సింగ్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులకు వీడ్కోలు



ఎంపీపీ, ఎంపీటీసీలకు వీడ్కోలు సన్మానం చేసిన అధికారులు

మోర్తాడ్, జూలై3: మోర్తాడ్ మండల పరిషత్‌లో ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులకు వీడ్కోలు వేడుక జరిపారు. మోర్తాడ్ మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు శివలింగు శ్రీనివాస్, ఎంపీటీసీసభ్యులకు బుధవారం మండల అధికారులు ఘనంగా వీడ్కోలు జరిపారు. వీడ్కోలు సమావేశంలో మండల స్థాయి అధికారులు పాలకవర్గం ఐదేళ్ల పాటు సమర్థవంతంగా పని చేసిందని, అధికారులకు అభివృద్ధిలో సహకరించారని పలువురు అధికారులు కొనియాడారు. ఈ ఎంపీపీ శివలింగు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోనే ఉత్తమ మండలం ఎన్నికకు అధికారులు ఎంతగానో సహకరించారని, అభివృద్ధిలో అధికారుల సహకారం ఎంతో ఉందని అన్నారు. పాలకవర్గం కలిసి పని చేశామని అన్నారు. ఐదేళ్ల పాటు ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని మండల స్థాయి అధికారులు, మండల ప్రజల సహకారం ఉందన్నారు. తమ పదవీకాలం పూర్తయిన ప్రజా జీవితంలో ఉంటామని, ప్రజలకు సేవ చేస్తానని ఆయన అన్నా రు. అనంతరం ఎంపీపీ శివలింగు శ్రీనివాస్ ఎంపీటీసీసభ్యులను పూలమాలలు, శాలువ, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. అంతేగాక మండలస్థాయి అధికారులను ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమల తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఈవో ఆంధ్రయ్య, కేఈఈ స్వరాజ్, వ్యవసాయాధికారి లావణ్య, ఏపీవో శకుంతల, ఏపీఎం ప్రమీల, ఐసీ డీఎస్ అధికారిణి ఉషారాణి, పంచాయతీ కార్యద ర్శులు సూపరిండెంట్ లింగయ్య, తదితరులు ప్రసంగించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వి.ప్రభాకర్

ఆర్మూర్‌రూరల్, జూలై3: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి వి.ప్రభాకర్, ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి.దేవరాంలు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు వంద రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఆరు నెలలు కావస్తున్న పూర్తిస్థాయిలో అమలు చేయడంలేదని విమర్శించారు. రైతు భరోసా, విధివిధానాలను రూపొందించడానికి వేసిన సబ్‌కమిటీ కనీసం రైతు సంఘాలను, రైతులతో సమావేశంలో నిర్వహించడంలేదన్నారు. సాగు చేయని భూములకు రైతు భరోసా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. సాగు చేసే పోడు రైతులకు పేద, మధ్యతరగతి రైతులకు పది ఎకరాల లోపు ఉన్న రైతులకు రైతు భరోసా వర్తింప జేయాలని వారు డిమాండ్ చేశారు. సన్న ధాన్యం కాకుండా అన్ని పంటలకు రూ.500బోనస్ ఇవ్వాలని, ఖరీఫ్ సీజన్‌కు ముందే వ్యవసాయ రుణాలు మాఫీ చేసే కొత్త రుణాలు పొందే అవకాశం రైతులకు ఉండేదన్నారు. ఐఎఫ్‌టీయు జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న, పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు నరేంధర్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు రాజన్న, అర్వింద్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, తహసీల్దార్

మోర్తాడ్, జూలై3: మండల కేంద్రంలో కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, తహసీల్దార్ సత్యనారాయణలు 49మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ధర్మోరాలో రెండు, దొన్కల్‌లో ఐదుగురికి, దోన్‌పాల్, పాలెంలో మూడు చొప్పున, శెట్‌పల్లిలో ఐదుగురికి, సుంకెటలో ఐదుగురు, తిమ్మాపూర్ నలుగురు,ఒడ్యాట్‌లో ఐదుగురు, మోర్తాడ్‌లో 17మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను వారు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యాల రాములు, ఎంపీటీసీ సభ్యులు జక్కం అశోక్, పుప్పాల అశోక్, మహిపాల్, రంజిత్, గిర్మాజీ గోపి, ప్రవీన్, సిహెచ్.గంగారెడ్డి, రాజ్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో 20మంది విద్యార్థుల ఎంపిక



మాట్లాడుతున్న డైరెక్టర్

బోధన్‌రూరల్,జులై3:బోధన్ పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో బుధవారం టాస్క్ ఆధ్వర్యంలో జెన్‌ప్యాక్ట్ బహుళ జాతీయ సంస్థ కొరకు నిరుద్యోగ యువత కోసం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 19కళాశాలల విద్యార్థులు 140మంది పాల్గొనగా నాలుగు దశల్లో నిర్వహించిన ఎంపిక దశలు సాయంత్రం వరకు కొనసాగాయి. చివరి దశలో 20మంది విద్యార్థులు ఫైనల్‌గా ఎంపికయ్యారు. కళాశాల విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం టాస్క్ ద్వారా ఉద్యోగమేళా నిర్వహించడం జరిగిందని ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ సూర్యప్రకాష్, డైరెక్టర్ దుశ్యంత్ తెలిపారు. జాబ్‌మేళాలలో 20మంది విద్యార్థులు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను టాస్క్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, జెన్‌ప్యాక్ట్ హెచ్‌ఆర్ శాంసన్, కళాశాల డైరెక్టర్ దుశ్యంత్‌లు ఎంపిక పత్రాలను నిరుద్యోగ యువతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ అనుబంధ సంఘ నాయకులు

ఆర్మూర్‌టౌన్,జూలై2: నేడు విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పీడీఎస్‌యు, ఏఐపీఎస్‌యు నాయకులు కోరారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బంద్‌ను పాటిస్తున్నట్టు తెలిపారు. నిట్ పరీక్ష పేపర్ లీక్ అయి ఫలితాల్లో స్కాం జరిగిందని, జున్ 14వ తేదీన ఫలితలు ఉండగా 4న ఫలితాలు ఇచ్చారని దేశ చరిత్రలో మొదటి 67మందికి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకులు రావడం అందులో ఒకే పరీక్ష కేంద్రం నుంచి ఎనిమిది మంది విద్యార్థులకు 720కి గాను 720మార్కులు రావడం యుజీసీ నెట్ పరీక్ష రద్దు కావడం, నిట్, పీజీ పరీక్ష వాయిదా పడడం అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఎంటీ ఏను ప్రక్షళన చేసి నిట్, నెట్, నెట్ పీజీని పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహిం చాలని అన్నారు. తక్షణమే ప్రదాని మోదీ స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షుడు శ్రావణ్, ఏఐఎస్ ఎఫ్ మండల అధ్యక్షుడు చోటు, నరేందర్, వరప్రసాద్, అనిల్, నిఖిల్, సిద్దు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఏర్గట్లలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

ఏర్గట్ల,జూలై 3: మండల కేంద్రంతో పాటు నాగేంద్రనగర్ గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను బుధవారం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన పడకంటి గంగారెడ్డి, సాదుల శ్రీనివాస్, కనగూర్తి గంగాధర్, జిట్టవేయిన రాజు కుటుంబాలను పరామర్శించి వారికి అండగా ఉంటామన్నారు.ఈకార్యక్రమంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పూర్ణానందం, బద్ధం శ్రీనివాస్ రెడ్డి, రొక్కెడ మోహన్, బద్ధం ప్రభాకర్, ఎలేటి బాల కిషన్, బద్ధం హన్మండ్లు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

5న కలెక్టరేట్ ముట్టడి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సుభాష్‌నగర్, జూలై 3:ఎన్నికల వాగ్దానంలో భాగంగా చేయూత పథకం ద్వారా దివ్యాంగులకు పెన్షన్లు పెంచుతామన్న ప్రభుత్వం వెంటనే పెంచాలని లేకుంటే ఈనెల 5వ తేదీన జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఎఎస్‌పి జిల్లా కోఆర్డినేటర్ సరికెల పోశెట్టి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌజ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 5వ తేదీలోపు పించన్లు పెంపుతేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఆరు నెలలు గడిచిన ఇప్పటికి పింఛన్లు పెంచకపోవడం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పెన్షన్‌దారులను విస్మరించడమేనని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు రోజుల్లోనే పించన్లను అందజేశారని అన్నారు. 5న జరిగే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వికలాంగుల పోరాట సమితి ఉపాధ్యక్షుడు నారాయణ, బీరప్ప, యమున, భూమయ్య, ప్రవీణ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ యాప్‌లలో విద్యుత్ బిల్లులు చెల్లించరాదు

- టీజీఎస్‌పీడీసీఎల్ యాప్ మాత్రమే ద్వారా చెల్లించాలి : ఎస్ఈ

సుభాష్‌నగర్, జూలై 3:టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ బిల్లులు టీజీఎస్‌పీడీసీఎల్ యాప్ ద్వారానే చెల్లించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ రవీందర్ తెలిపారు. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, అమేజాన్ లాంటి ప్రైవేట్ ఆప్‌లలో బిల్లులు చెల్లించరాదని అన్నారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం విద్యుత్ బిల్లులు టీజీఎస్‌పీడీసీఎల్ ఆప్‌లోనే చెల్లించాలన్నారు. గూగుల్ ప్లేస్టోర్‌కు వెళ్లి టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని విద్యుత్ బిల్లును చెల్లించాలన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యాయం చేయాలని మహిళ ధర్నా



హౌసింగ్‌బోర్డులో ధర్నా చేస్తున్న గిర్మాజీ అశ్విని

ఆర్మూర్‌టౌన్, జూలై2: పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో అత్తగారింటి ముందు సత్‌పుతే గిర్మాజీ అశ్విణి తన ఇద్దరు కుమారులతో కలిసి న్యాయం చేయాలని బుధవారం ధర్నా నిర్వహించారు. తన భర్త సత్‌పుతే గిర్మాజీ అర్వింద్ గత కొన్నేళ్లుగా పట్టించుకోవడంలేదని వేరే ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని అశ్విని ఆరోపించింది. తనను, తమ ఇద్దరు కుమారులను ఇంట్లోకి రానివ్వకుండా తన భర్త, అత్తమ్మ అడ్డుకుంటున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

స్కాలర్‌షిప్‌ల కోసం బిక్షాటన

నిజామాబాద్ అర్బన్, జూలై 3: పెండింగ్‌లో ఉన్న రూ.7వేల కోట్లకు పైగా ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘం నాయకులు బుధవారం నగరంలో బిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగ్ కన్వీనర్ శశి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. స్కాలర్‌షిప్‌లు రాక కళాశాలల యాజమాన్యాలు ఫీజులు కట్టాలని విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలన్నారు. కొన్ని కళాశాలలు ఫీజులు చెల్లించకపోతే సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని విద్యార్థులు పై చదువులు చదివేందుకు ఇబ్బందులు పడుతున్నారని కావున వెంటనే బకాయిలు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సునీల్, బాలకృష్ణ, దుర్గాదాస్, మహేష్, ప్రవీణ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార కల్తీపై చైతన్య సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఆహార కల్తీ నియంత్రణ అధికారి

సుభాష్‌నగర్, జూలై 3: మార్కెట్‌లో అనేక కల్తీ ఆహార పదార్థాలు తయారవుతున్నాయని కల్తీపై వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆహార కల్తీ నియంత్రణ అధికారి తార్యానాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కిషన్‌గంజ్‌లో ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఆహారకల్తీపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆహార కల్తీ నియంత్రణ అధికారి తార్యానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో కేటాయించిన మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌లో ఆహార కల్తీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కందిపప్పు, కారం పొడిలలో సింథటిక్ కలర్స్, మెటనిక్ ఎల్లో కలుపుతారని తెలిపారు. వంట నూనెల ప్యాకెట్లపై కుక్కింగ్ ఆయిల్ మా త్రమే రాసి ఉంటుందని ప్యాకింగ్‌పై బొమ్మలు మాత్రం పొద్దుతిరుగుడు, వేరుశనగ ఉండటంపై వినియోగదారులు జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం జిల్లా మహిళా సంక్షేమ అధికారి రసూల్‌బీ మాట్లాడుతూ అంగన్‌వాడి సెంటర్లకు ప్రభుత్వమే బియ్యం, టెట్రాపాలు, వంటనూనెలు, కారంపొడి, బాలామృతం నాణ్యతతో సరఫరా చేస్తుందని అన్నారు. వినియోగదారుల్లో నిరంతర చైతన్యం శ్రీరామ రక్ష అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆహార కల్తీపై చైతన్య కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌కుమార్, ప్రవీణ్, వర్మ, శ్రీనివాస్, రత్నాకర్, రవికుమార్, సందీప్, దేవేశ్, తదితరులు పాల్గొన్నారు.

కేజ్‌వీల్స్ రోడ్లపై నడిపితే కఠిన చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈ రాజయ్య

రెంజల్,జూలై3: కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌లు రోడ్లపై నుంచి నడపకుండా వాటికి పట్టీలు ఏర్పాటు చేసి నడపాలని, పట్టీలు ఏర్పాటు చేయకుండా రోడ్లపై నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ రాజయ్య, ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం రెంజల్, దూపల్లి గ్రామాలలో ట్రాక్టర్ యాజమానులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లపై నుంచి కేజ్‌వీల్స్ నడిపితే రూ.5వేల జరిమాన విధించడం జరుగుతుందని, రోడ్లపై కేజ్‌వీల్స్ నడపడం వల్ల ప్రభుత్వం లక్షలాది రూపాయలు పెట్టి వేసిన రోడ్డు ధ్వంసం అవుతుందని జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే ఆదేశానుసారం రోడ్లపై నుంచి కేజ్‌వీల్స్ నడపరాదని ఈ పనులకు శ్రీకారం చుట్టినట్లు వారు తెలిపారు. రోడ్లపై పట్టీలు వేసి నడపాలని లేనియెడల యాజమానులకు జరిమానలు విధించడమే కాకుండా వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని, రైతులు యాజమానులు, తమ ఊరిలో ఉన్న రోడ్లను బాగుపర్చుకోవాలంటే కేజ్‌వీల్స్ ట్రాక్టర్లకు పట్టీలు వేసి ప్రభుత్వ ధనాన్ని వృధా కానివ్వకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గౌసోద్దీన్, పంచాయతీరాజ్ ఏఈ వినయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజేందర్ రావు, ట్రాక్టర్ యాజమానులు బోడ పోశెట్టి, గంగాగౌడ్, అలియాన్, శ్రీనివాస్, దత్తు, పోశెట్టి, తదితరులున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు రైతుబంధు ఇవ్వొద్దు



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి సంతోష్

బోధన్‌రూరల్,జూలై3: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రైతుబంధు పథకాన్ని ఇవ్వవద్దని సాలూర మండల కేంద్రంలోని రైతులు స్పష్టం చేశారు. బుధవారం సాలూర, హున్స సహకార సంఘాలలో రైతుబంధు పథకం అమలుపై ప్రత్యేక అధికారి శ్రీరామ్ సమక్షంలో సహకార సంఘాల చైర్మన్‌ల అధ్యక్షతన రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. 10ఎకరాల రైతులకు రైతుబంధు పథకాన్ని అమలు చేయాలని, బీడు భూములకు, గుట్టలకు రైతుబంధు పథకాలు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వ పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు బోనస్‌గా 500రూపాయలు చెల్లించాలని రైతులు కోరారు. భార్యభర్తలకు ఇద్దరికి కలిసి 5ఎకరాల లోపు ఉన్న వారికే రైతుబంధు అందించాలని రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కౌలు రైతులకు సైతం రైతుబంధు పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోధన్ వ్యవసాయ అధికారి సంతోష్, సాలూర సహకార సంఘం చైర్మన్ అల్లె జనార్థన్, బస్వంత్ రావు పటేల్, డైరెక్టర్లు, రైతులు, హున్స సహకార సంఘం చైర్మన్ మందర్నా రవి, ఏఈవో అపర్ణ, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్

ధర్పల్లి, జూలై3: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని ఒన్నాజీపేట్ ఉన్నత పాఠశాల, మండల కేంద్రంలో గల మోడల్, కస్తూర్బా ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన అధ్యాపక బృందంచే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు ఏకరూప దుస్తులను అందించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదవాలని ఆయన సూచించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్

నిజామాబాద్ అర్బన్, జూలై 3:నీట్ పరీక్ష పత్రాల లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా గురువారం విద్యాసంస్థలకు బంద్‌కు పిలుపునిచ్చారు. ఎన్ఎస్‌యుఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యూ, ఏఐపీఎస్‌యూ విద్యార్థి సంఘాలు జిల్లా వ్యాప్తంగా కేజీ టూ పీజీ విద్యాసంస్థలకు బంద్ పిలుపునిచ్చారు.ఈమేరకు జిల్లాలోని విద్యాసంస్థలు తమ స్కూళ్లు, కళాశాలలకు గురువారం బంద్‌ను ప్రకటించాయి.

ఎస్ హెచ్‌వో బదిలీ

ఆర్మూర్ టౌన్ జూలై 3: ఆర్మూర్ ఎస్ హెచ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్న రవికుమార్ బదిలీ అయినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో భీమ్‌గల్ ఎస్ హెచ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్న నాగపూరి శ్రీనివాస్ ఆర్మూర్ ఎస్ హెచ్‌వో బదిలీపై రానున్నారు.

ఐకమత్యంతో ఉంటేనే అభివృద్ధి సాధ్యం

- జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు



ఈద్గాలో పనులను పరిశీలిస్తున్న దృశ్యం

నందిపేట, జూలై 3: సంఘంలోని వ్యక్తులు ఐకమత్యంతో ఉంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారివిఠల్‌రావు అన్నారు. బుధవారం నందిపేట మండలకేంద్రంలోని ఈద్గా వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.5లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈజీఎస్ కూలీలు, ముస్లిం మైనార్టీ నాయకులతో కలిసి పిచ్చి మొక్కలను విఠల్ రావు తొలగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో బి శ్రీనివాస్ రావు, జెడ్పీటీసీ సభ్యురాలు ఏర్రం యమున, ఎంపీపీ వాకిడి సంతోష్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ హుస్సేన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, బీఆర్ఎస్ నాయకులు ఏర్రం ముత్యం, నాయుడు రామారావు, మైనార్టీ నాయకులు ఎస్‌కె జావెద్, డాక్టర్ అహ్మద్ తధితరులు ఉన్నారు.

ముగిసిన అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ

ఎడపల్లి, జూలై 3: నూతన జాతీయ విద్యా విధానంపై ఎడపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎడపల్లి, రెంజల్ మండలాల అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల పాటు ఇస్తున్న శిక్షణ కార్యక్రమం బుదవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు బోధనలో మార్పు, నూతన జాతీయ విద్యా విధానం, బోధనలో మెలుకులు అనే పలు అంశాలపై శిక్షణ కల్పించారు. ఈ కార్యక్రమంలో బోధన్ సీడీపిఓ జానకమ్మ, మాస్టర్ ట్రైనర్స్ ఆసియా బేగం, రాధా లక్ష్మి, ఎడపల్లి మండల ఐసిడిఎస్ సూపర్ వైజర్ విజయ రాణి, రెంజల్ మండల ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి, పోషణ అభియాన్ కో ఆర్డినేటర్ నరేష్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

భారీగా ఎండు గంజాయి స్వాధీనం

- ఇద్దరు వ్యక్తుల అరెస్టు



నగరంలో గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

సుభాష్‌నగర్, జూలై3: ఎండు గంజాయిని సరఫరా చేస్తున్నారన్న పక్కా సమాచారంతో దాడి చేసి సుమారు 6 కిలోల 103 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ స్వప్న తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నగరంలోని కృష్ణ మందిరం నుంచి బైపాస్ వెళ్లే రోడ్డులో సత్సంగ్ భవన్ ఎదురుగా గలఖాళీ స్థలంలో ఎండు గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారంతో తనిఖీలు నిర్వహించగా ఇద్దరు వ్యక్తులు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారని వారి వద్ద నుంచి సుమారు 6.103 కేజీల గంజాయి దొరికిందని తెలిపారు. అమ్మడానికి వినియోగిస్తున్న రెండు బైకులు, ఫోన్‌లు, నగదు రూ.10వేల 90లను స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరు నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఇర్ఫాన్‌ఖాన్, మహ్మద్ యూసుఫ్‌లుగా గుర్తించారు. ఇర్ఫాన్‌ఖాన్ వద్ద 0.704 కేజీ, యూసుఫ్ వద్ద 5.399 కేజీల గంజాయి దొరికిందని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది నర్సింహాచారి, హమీద్, బోజన్న,శివకుమార్, మంజుల, ఆశన్న, లక్ష్మణ్,గంగారాం,రాజన్నలు పాల్గొన్నారు.

7న వంగపల్లి దీక్షను విజయవంతం చేయాలి



కరపత్రాలు చూపుతున్న దృశ్యం

సుభాష్‌నగర్, జూలై 3: ఈనెల 7న ఎస్సీ వర్గీకరణ కోసం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఎమ్మార్పీఎస్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ చేపట్టిన దీక్షను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్‌టీఎస్ జిల్లా అధ్యక్షుడు సల్లూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో వంగపల్లి దీక్ష కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వందరోజుల్లో వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి తప్పిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వంగపల్లి శ్రీనివాస్ హైదరాబాద్‌లో ఇందిరా పార్కు వద్ద దీక్ష చేయనున్నారని మాదిగలు, మాదిగ ఉప కులాలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిన్నారం రవి, కిన్నెర అనురాధ, నక్క రమేష్, నారా యణ, సౌజన్య, సాయిబాబా, సాల్మాన్, నర్సమ్మ, ఎల్లమ్మ, పోసాని, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవద్దు



ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఖిల్లా, జూలై 3: 18 ఏళ్లు నిండని బాల బాలికలను పనిలో పెట్టుకోవడం, బిక్షాటన చేయించడం చేయరాదని ఆపరేషన్ ముస్కాన్ అవగాహన కార్యక్రమాన్ని బుధవారం రైల్వేస్టేషన్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ చైతన్య, బచ్‌పన్ బచావో బృందం సోని, పవన్, విశ్వనాథ్, రైల్వే పోలీస్ ఎస్సై సాయిరెడ్డి, వరలక్ష్మి, నజ్మా తదితరులు పాల్గొని ప్రచారాం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా బాల బాలికలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు.

టోల్‌ప్లాజా వద్ద ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇందల్వాయి, జూలై 3: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేస్తున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని బుధవారం ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. రూరల్ నియోజకవర్గంలోని డిచ్‌పల్లి, అమృతాపూర్, తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి వస్తున్న ఆయనకు టోల్‌ప్లాజా వద్ద స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఇందల్వాయి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, డిచ్‌పల్లి మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, శ్యామ్‌సన్, కంచెట్టి గంగాధర్, నరేష్, కిషన్, తదితరులు ఉన్నారు.

రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న వాజీద్ హుస్సేన్

రుద్రూరు, జూలై 3: మండలంలోని రుద్రూరు, రాయకూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో సొసైటీల అధ్యక్షుడు బద్దం సంజీవ్‌రెడ్డి, సంగమేశ్వర్‌ల అధ్యక్షతన బుధ వారం రైతు భరోసాపై రైతుల ప్రజాభిప్రాయ సేకరణపై ప్రత్యేక మహాజన సభలను నిర్వహించారు. రుద్రూరులోని నిర్వహించి మహాజన సభలో ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ పాల్గొని రైతుల యొక్క సలహాలు, సూచనలను సేకరించారు. రుద్రూరు, రాయకూర్‌లలో ఎక్కువ మంది రైతులు ఐదు ఎకరాల లోపు పంట సాగు చేసే భూములకు మాత్రమే రైతు భరోసా అందించాలని అభిప్రాయాలు ఎక్కువ వ్యక్త మయ్యాయి.ఈ కార్యక్రమాలలో జడ్పీటీసీ నారోజి గంగారాం, డైరెక్టర్లు గుర్ర గోపి, కర్కే అశోక్, వేముల గజేందర్, బాల్‌రాజ్, గంగారాం, కార్యదర్శులు జి.లక్ష్మణ్, సాయికుమార్, ఏవో నగేష్‌రెడ్డి, క్లస్టర్ ఆఫీసర్ రియా జుద్దీన్, ఏఈవో శ్రావణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72800	రూ.67,100	రూ.920

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : కల్కి(3డి తెలుగు) (5.50, 9.20, 12.50, 4.20, 7.50, 11.20)
స్క్రీన్-2 : కల్కి(3డి తెలుగు) (6.10, 9.40, 3.30, 7.00, 10.30)
: ఇన్‌సైడ్ ఔట్-2 (ఇంగ్లీష్ 3డి) (1.10)
స్క్రీన్-3 : కల్కి(తెలుగు) (5.40, 9.10, 12.40, 7.10, 10.40)
: మహారాజ (4.10)
స్క్రీన్-4 : కల్కి(తెలుగు) (5.30, 9.00, 12.30)
: ముంజియా (హిందీ) (4.00)
: కల్కి(హిందీ) (6.45, 10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి(తెలుగు) (3.10, 7.00, 10.40)
స్క్రీన్-2 : కల్కి(తెలుగు) (10.30)
: కల్కి(తెలుగు 3డి) (4.00, 7.30, 10.45)
స్క్రీన్-3 : కల్కి(తెలుగు) (1.30)

దేవి : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కల్కి(హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్